


భీమవరం మండలంలో రహదారిపై వర్షపు నీరు


భీమవరం మండలంలో నారుమడిలో నీరు తోడుతున్న రైతు

నారు మునిగింది

- జిల్లాలో 4,500 ఎకరాలలో నారుమడులు పూర్తి
- 2వేల ఎకరాలపైగా ముంపులోనే
- భారీ వర్షాలతో రహదారులు జలమయం

భీమవరం రూరల్, జూలై 7: భారీ వర్షాలతో సార్వా నారుమడులు మరోసారి నీట మునిగాయి. డెల్టా ప్రాంతంలో నారుమడులు ఆలస్యమైన చోట్ల వర్షానికి ముంపు బారిన పడ్డాయి. రెండు రోజులు నుంచి అధిక వర్షపాతం నమోదు కావడంతో నారుమడులను రక్షించే ప్రయత్నాలలో రైతులు విఫలమయ్యారు. వాతావరణం అనుకూలిస్తే గాని నారుమడులు దక్కించుకునే పరిస్థితులు లేవు. జిల్లాలో 2.11 లక్షల ఎకరాల్లో వరి సాగుకు 5వేల ఎకరాలలో నారుమడులు వేయాల్సి ఉంది. ఇప్పటి వరకు 4500 ఎకరాల్లో నారుమడులు వేశారు. మెట్ట ప్రాంతం, తాడేపల్లిగూడెం, పెంటపాడు, తణుకు ప్రాంతాలలో నారుమడులు వేసి 15 రోజులు కావస్తుండంతో ముంపు బెడద లేదు. ఆలస్యంగా వేసిన 2వేల ఎకరాల నారుమడులు భీమవరం, నర్సాపురం, వీరవాసరం, కాళ్ళ పలు మండలాలలో పూర్తిగా మునిగాయి. ఇంకా 500 ఎకరాల్లో నారుమడులు వేయాల్సి ఉండగా అనుకూల పరిస్థితులు లేవు. సార్వా ఆదిలోనే రైతులు అవస్థలు పడుతున్నారు.



రెండు సార్లు మునిగింది

నారుమడి వేసి 9 రోజులవుతోంది. ఇప్పటికి రెండోసారి వర్షపునీటికి మునిగింది. నీటిని బయటకు తోడితే మళ్లీ వర్షం కురవడంతో నిండా మునిగింది. వారం రోజుల క్రితం నారుమడి వేసినప్పుడు రెండు రోజులు వర్షాలతో ఇబ్బంది పడ్డాను. ఇప్పుడు మూడు రోజుల నుంచి నారుమడి రక్షించుకునే ప్రయత్నం చేస్తునే ఉన్నాను.

మాధవ ప్రసాద్, రైతు, శృంగవృక్షం

రెండు రోజుల్లో 67 మి.మీ. వర్షపాతం

పెంటపాడు, భీమవరం రూరల్: మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రహదారులు జలమయం అయ్యాయి. గడిచిన రెండు రోజుల్లో జిల్లాలో 67 మి.మీ. వర్షపాతం నమోదైంది. నారుమడులు ముంపుతో పాటు పంట భూములలో మూడడుగుల నీరు నిలిచి చెరువులను తలపిస్తున్నాయి. ఆదివారం తాడేపల్లిగూడెంలో 78 మి.మీ., పెంటపాడులో 57.2 మి.మీ. అత్యధిక వర్షపాతం నమోదైంది.

పెంటపాడు మండలంలో ఆదివారం సుమారు తెల్లవారుజామున 4 గంటలకు ప్రారంభమైన ఏకధాటిగా రెండు గంటల సేపు కురిసింది. గ్రామాలలో రహదారులు కాలువలా మారిపోయాయి. తాడేపల్లిగూడెం మార్కెట్ బురదమయమైంది. ఆదివారం మార్కెట్ కొనుగోలుదారుల రద్దీతో అవస్థలు పడ్డారు. డ్రెయినేజీల నుంచి నీరు సరిగ్గా వెళ్లకపోవడంతో రహదారులు కాలువలా మారాయి. రావిపాడులో నారుమడులు నీట మునిగాయి.


బి.కొండేపాడులో కాలువను తలపిస్తున్న రహదారి

ముంపు ముప్పు


శిథిలావస్థలో కాజ స్లూయిస్




నరసాపురం వద్ద ఏటిగట్టుకు తడికలతో తాత్కాలిక అడ్డుకట్ట

వర్షాకాలం వరద భయంతో గోదావరి తీరం బిక్కుబిక్కుమంటుంది. దీనికితోడు ఏటిగట్టు బలహీనపడడం, నరసాపురం వద్ద కోతకు గురికావడం, పలు మండలాల్లో స్లూయిస్‌లు శిథిలావస్థకు చేరడంతో ముంపు ముప్పు పొంచివుంది. వైసీపీ పాలనలో ఐదేళ్లుగా ఏటిగట్టు పటిష్ఠతకు తట్ట మట్టికూడా వేయకపోవడంతో ఈ పరిస్థితి దాపురించింది. నరసాపురం పట్టణం పొన్నపల్లి వద్ద 400 మీటర్ల ఏటిగట్టు కోతకు గురైనా అప్పటి ప్రభుత్వం నిర్లక్ష్యం వహించింది. ఏటిగట్టు పటిష్ఠం చేసే పనులు పూర్తి కాలేదు. తాత్కాలిక ఏర్పాట్లతో నెట్టుకొచ్చారు. ఇటీవల అధికారం చేపట్టిన తెలుగుదేశం పార్టీ కూటమి ప్రభుత్వం ముంపు ముప్పును గ్రహించి తక్షణం దిద్దుబాటు చర్యలు చేపట్టింది. జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు చొరవతో అధికారులు రూ. 30.50 కోట్లతో పనులు చేపట్టేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. నిధులు మంజూరు కాగానే పనులు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నారు.

గోదావరి వరద వస్తే.. పంట పొలాల మునక ?

- వైసీపీ పాలనలో ఏటిగట్టు పనులపై నిర్లక్ష్యం
- శిథిలావస్థలో స్లూయిస్‌లు
- టీడీపీ కూటమి కొలువుతీరగానే గోదావరి గట్టుపై దృష్టి
- రూ.30.50 కోట్లతో పనులకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు

నరసాపురం, జూలై 7: వర్షాకాలం గోదావరి పరివాహక ప్రాంత ప్రజలను వరద భయం వెన్నాడుతుంది. జూలై, ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో బిక్కుబిక్కుమంటూ గడుపుతారు, మహారాష్ట్ర, తెలంగాణ ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిస్తే ఆ ప్రభావం గోదావరిపై పడుతుంది. ఇప్పటికే గోదావరికి వరద నీరు తాకింది. రానున్న రెండు నెలల్లో భారీ స్థాయిలో వరద వస్తే ముంపు ముప్పు పొంచిఉంది. గత ఐదేళ్లలో గోదావరి ఏటిగట్టు పటిష్ఠతకు ఎటువంటి చర్యలు చేపట్టలేదు, పలుచోట్ల గట్టు బలహీనపడినప్పటికీ కనీసం తట్టెడు మట్టి కూడా వేయలేదు. మరోవైపు వరదను నియంత్రించే స్లూయిస్‌లు శిథిలావస్థకు చేరాయి. వీటిని ఆధునీకరించాలని ఇంజనీర్లు నివేదించినా కనీసం నిధులు కూడా విడుదల చేయలేదు. పొంచి ఉన్న ఈ ప్రమాదాన్ని అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం గుర్తించింది. జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఆదేశాలతో అధికారులు ఆఘమేఘాలపై ప్రతిపాదనలు తయారు చేశారు. స్లూయిస్ పటిష్ఠత పనులకు రూ 9 కోట్లు, సుమారు 11 కిలోమీటర్ల మేర గట్టు పటిష్ఠత, పెండింగ్ పనుల పూర్తికి రూ. 21.50 కోట్లు ఖర్చవుతుందని అంచనాలు ప్రభుత్వానికి పంపారు. నిధులు మంజూరైతే వేగవంతంగా ఈ పనులు చేపట్టేందుకు సన్నద్ధమవుతున్నారు.

11 కిలోమీటర్ల మేర గట్టు బలహీనం

జిల్లాలో దొంగరావిపాలెం నుంచి నరసాపురం మండలం బియ్యపుతిప్ప వరకు సుమారు 60 కిలోమీటర్ల మేర ఏటిగట్టు విస్తరించింది. 1986 వరదలను పరిగణనలోకి తీసుకుని 2007లో గోదావరి గట్టును పటిష్ఠం చేశారు. మూడు కిలో మీటర్ల పనులు అసంపూర్తిగా నిలిచాయి. వరదల సమయంలో ఇసుక బస్తాలతో తాత్కాలిక చర్యలు చేపడుతున్నారు. గడిచిన ఏడేళ్లలో దొడ్డిపట్ల, వాకలగరువు, ఆబ్బిరాజుపాలెం, గంగడపాలెం, యలమంచిలి, లక్ష్మీపాలెం, చించినాడ, రాజుల్లంక వద్ద వరద ప్రవాహానికి గట్టు బలహీనపడింది. భారీ వరదొస్తే ఈప్రాంతాల్లో నీరు గట్టుపై నుంచి ప్రవహించే ప్రమాదం ఉంది. ఈ గ్రామాల్లో గట్టును పటిష్ఠపర్చడంతో పాటు ఎత్తు పెంచాల్సి ఉంది. ఈపనులకు గతంలో ప్రతిపాదనలు పంపినా నిధులు మంజూరు కాలేదు. ప్రస్తుతం పనులకు రూ 21.50 కోట్లు ఖర్చవుతుందని ప్రభుత్వానికి నివేదించారు.

నరసాపురం వద్ద 250 మీటర్లు పెండింగ్

2022 వరదలకు నరసాపురం పట్టణంలోని పొన్నపల్లి వద్ద ఏటిగట్టు 400 మీటర్ల మేర కోతకు గురైంది. గట్టు పటిష్ఠం చేయడానికి రూ.27 కోట్లు మంజూరు కావడంతో 2022లో పనులకు శంకుస్థాపన చేశారు. పనులు చేపట్టినప్పటికీ గట్టు పలుసార్లు కోతకు గురైంది. ఇప్పటివరకు 150 మీటర్ల మేర గట్టును అభివృద్ధి చేశారు. వరదొస్తే ఈ పనుల్లో నాణ్యత స్థాయి తేలనుంది. ఇంకా 250 మీటర్ల పెండింగ్ ఉంది. ప్రస్తుతం కోతకు గురైన ఈ ప్రాంతంలో సరుగుడు కర్రలు పాతి తాత్కాలికంగా తడికెలు కట్టారు. తక్షణం ఈ పనులు చేపట్టకపోతే పెనుముంపు తప్పదు.

శిథిలావస్థలో స్లూయిస్‌లు

వరదల సమయంలో స్లూయిస్‌ల కారణంగా భారీ ముంపు సంభవిస్తుంది. గోదావరికి ఆనుకుని ఉన్న కాజ, నరసాపురం వద్ద ఐదు తూములు, ముస్కేపాలెం, బియ్యపుతిప్ప ఈస్ట్‌కొక్కిలేరు, దర్భరేవు స్లూయిస్‌లు శిథిలావస్థలో ఉన్నాయి. గతంలో టెండర్లు పిలిచారు. కాంట్రాక్టర్లు ఎవరూ ముందుకు రాలేదు. ప్రస్తుతం ప్రభుత్వం వీటి ఆధునీకరణకు 9 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశారు.

ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం

వరద నియంత్రణకు ముందస్తు జాగ్రత్తలు చేపట్టాం. ఇసుక బస్తాలు సిద్ధం చేస్తున్నాం. గట్టు బలహీనంగా ఉన్న చోటికి వీటిని తరలిస్తున్నాం. ఈనెల 1 నుంచి 9 మంది లస్కర్లను విధుల్లోకి తీసుకున్నాం, బలహీనంగా ఉన్న 11 కిలోమీటర్ల గట్టు, ఐదు స్లూయిస్‌లను ఆధునీకరించాలని ప్రభుత్వానికి నివేదించాం. మంత్రి నిమ్మల రామానాయుడు ఆదేశాలతో రూ.30.50 కోట్లతో ప్రతిపాదనలు ఇచ్చాం.

- సుబ్బారావు, ఏఈ, ఏటిగట్టు శాఖ

పశ్చిమ డెల్టాకు మంచి రోజులు

కాలువలు, డ్రెయిన్ల ప్రక్షాళనకు టెండర్ల ఖరారు

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

పశ్చిమ డెల్టాకు మంచి రోజులొచ్చాయి. గత ఐదేళ్లలో పంట కాలువలు, డ్రెయిన్లను వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. వేసవి పనులు సక్రమంగా చేయలేదు. పనులు చేసినా బిల్లులు చెల్లించలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే డెల్టాపై దృష్టి పెట్టింది. కాలువలు, డ్రెయిన్‌లు ప్రక్షాళనకు నిధులు కేటాయించింది. జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు బాధ్యతలు చేపట్టిన వెంటనే డెల్టాలో కాలువలు, డ్రెయిన్లకు రూ. 13 కోట్లు నిధులు కేటాయించారు. పనులకు టెండర్లు కూడా ఖరారయ్యాయి. మరోవైపు తూడు, గుర్రపు డెక్క పనులు ప్రారంభించారు. పక్షం రోజుల్లో కాలువలు, డ్రెయిన్లలో పనులను పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. ప్రధానంగా తూడు. గుర్రపు డెక్క తొలగించి డ్రెయిన్‌లతో పూడిక తొలగించడం ద్వారా పంట పొలాలు మునకనుంచి గట్టెక్కనున్నాయి. ప్రస్తుతం జిల్లాలో కొద్దిపాటి వర్షాలు కురిస్తేనే పంట పొలాలు ముంపుబారిన పడుతున్నాయి. డ్రెయిన్లు ప్రవహించకపోవడంతో పంట పొలాల నుంచి నీరు బయటకు వెళ్లడం లేదు. ఐదేళ్లుగా డ్రెయిన్‌లు పూడుకుపోయాయి. వెసీపీ ప్రభుత్వం బిల్లులు చెల్లించదనే అనుమానం కాంట్రాక్టర్లలో నాటుకుపోయింది. అందుకు తగ్గట్టుగానే బిల్లులు కూడా ఇవ్వలేదు. రైతులు చెల్లించిన నీటి తీరువా పక్కదారి పట్టించింది. రైతులకు ప్రయోజనం చేకూర్చే కాలువల మరమ్మతులకు ఉపయోగించలేదు. జలవనరుల శాఖ గడచిన ఐదేళ్ల చీకటి రోజులను చూసింది. అధికారులు పనులు చేపట్టలేని చేతకాని వారిలా మిగిలిపోయారు. వైసీపీ ప్రజాప్రతినిధులు కూడా నిస్సహాయస్థితిలో ఉండిపోయారు. కూటమి ప్రభుత్వం అత్యవసరంగా కాలువలు, డ్రెయిన్‌లలో దాదాపు 100 పనులు చేపట్టేలా చర్యలు తీసుకున్నారు.


పట్టిసీమ ఎత్తిపోతల నుంచి విడుదలవుతున్న గోదావరి జలాలు

పట్టిసీమ ఎత్తిపోతలు

పోలవరం, జూలై 7 : పట్టిసీమ ఎత్తిపోతల పథకం నుంచి 6,018 క్యూసెక్కుల గోదావరి వరద జలాలను పోలవరం ప్రాజెక్టు కుడి కాల్వకు విడుదల చేసినట్టు డీఈఈ పెద్దిరాజు ఆదివారం తెలిపారు. పట్టిసీమలో గోదావరి నీటిమట్టం 14.774 మీటర్లకు చేరుకుందని, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 17 పంపులు, 12 మోటార్లతో నీటిని విడుదల చేసినట్టు తెలిపారు. కృష్ణా డెల్టాలో నీటి అవసరత దృష్ట్యా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పంపుల సంఖ్య పెంచి నీటిని విడుదల చేస్తున్నట్టు తెలిపారు.

నిలకడగా గోదావరి నీటిమట్టం

పోలవరంలో గోదావరి నీటిమట్టం ఆదివారం సాయంత్రానికి నిలకడగా ఉంది. ఎగువన వర్షాలతో కొండవాగులు, గోదావరి ఉప నదుల నీరు గోదావరిలో చేరడంతో నీటిమట్టం పెరిగింది. స్పిల్‌వే 48 గేట్ల నుంచి నీరు విడుదలతో స్పిల్‌వేలో సాధారణ నీటిమట్టం మాత్రమే నమోదైంది. ప్రాజెక్టు స్పిల్‌వే ఎగువన 26.550 మీటర్లు, దిగువన 16.580 మీటర్లు నమోదైనట్టు ఈఈలు పి.వెంకటరమణ, మల్లికార్జునరావు తెలిపారు.

ఇసుకపై కసరత్తు



- నేటి నుంచి ఉచిత విధానం
- బోట్స్‌మెన్ కమిటీలతో సమావేశం కానున్న అధికారులు
- ఆ తర్వాతే ధర నిర్ణయం

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

తెలుగుదేశం కూటమి ప్రభుత్వం ఉచిత ఇసుక విధానం అమలు చేస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా సోమవారం నుంచి అమలులోకి రానుంది. కూటమి హామీల్లో ఒకటైన ఉచిత ఇసుకపై ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలిచ్చింది. స్టాక్ పాయింట్‌లో ఉన్న ఇసుకను ముందుగా సరఫరా చేయాలని ఆదేశించింది. జిల్లాలో నరసాపురం, భీమవరం, పాలకొల్లు, తణుకు, తాడేపల్లిగూడెంలో స్టాక్ పాయింట్‌లలో ఇసుక నిల్వలు లేవు. మరోవైపు సిద్ధాంతం, కోడేరు, కరుగోరుమిల్లి తదితర ప్రాంతాల్లో ఓపెన్ రీచ్‌లు ఉండగా ప్రస్తుతం కరుగోరుమిల్లి ర్యాంప్‌లోనే తవ్వకానికి అనుమతి ఉంది. మనుషులతో మాత్రమే తవ్వకాలు చేపట్టాలనే నిబంధనతో అక్కడ కూడా తవ్వకాలు లేవు. ఓపెన్ ర్యాంప్‌ల్లో తవ్వకాలు చేపట్టకుండా జిల్లాలో ఆరు కమిటీలను ఏర్పాటు చేశారు. ఇప్పుడు గోదావరి నదిలో మునిగి తవ్వకాలు సాగించే రీచ్‌లపైనే ఆధారపడాల్సి ఉంది. మరోవైపు తూర్పుగోదావరి జిల్లాకు చెందిన రీచ్‌ల నుంచి దిగుమతికి అవకాశం ఉంది. జిల్లాలో యలమంచిలి, నరసాపురం పరిధిలో ఆరు రీచ్‌లు అందుబాటులో ఉన్నాయి. అక్కడే గోదావరిలో మునిగి ఇసుక తీసి పడవలపై ఒడ్డుకు చేర్చాలి. ఆ బాధ్యతను బోట్స్‌మెన్ సొసైటీలకు ప్రభుత్వం అప్పగించింది. బోట్స్‌మెన్ సొసైటీలతో సంప్రదించి తవ్వకంతోపాటు, పడవలపై ఒడ్డుకు చేర్చేలా ధరను నిర్ణయించనున్నారు. సోమవారం నరసాపురంలో జిల్లాలోని బోట్స్‌మెన్ సొసైటీలతో అధికారులు సమావేశమై ధర నిర్ణయిస్తారు. స్టాక్ పాయింట్‌లలో ఉన్న ఇసుకపైనా అదే పరిస్థితి. స్టాక్ పాయింట్‌ల వద్దకు రవాణా వ్యయాన్ని లెక్కించి టన్ను ఇసుక ధర నిర్ణయిస్తారు.

వరదొస్తే సమస్య

గడచిన వేసవిలో అనధికారికంగా ఇసుక తవ్వకాలు చేపట్టారు. దాంతో ఇసుక నిల్వలు లేవు. ఇప్పుడు గోదావరికి వరద రావడంతో ర్యాంప్‌లన్నీ మూతపడనున్నాయి. గోదావరి తీర ప్రాంతంలోనే ఇసుక విరివిగా లభిస్తుంది. వర్షాకాలంలో ఓపెన్ ర్యాంప్‌లు పనిచేయవు. వరదలు తగ్గిన తర్వాతే మళ్లీ ఓపెన్ ర్యాంప్‌లు అందుబాటులోకి రానున్నాయి. జిల్లాలో సిద్ధాంతం వద్ద అతిపెద్ద ర్యాంప్ ఉంది. తర్వాత ఆచంట మండలంలో తవ్వకాలు సాగిస్తుంటారు. తిరిగి డిసెంబరులో ఓపెన్ ర్యాంపులు అందుబాటులోకి వస్తాయి. అప్పటి వరకు గోదావరిలో మునిగి తీసే రీచ్‌లపైనే ఆధారపడాల్సి రావడంతో ఇసుక ధర కాస్త ఎక్కువ ఉంటుంది. ఓపెన్ రీచ్‌లో తవ్వకానికి అనుకూలం కాబట్టి ధర తక్కువగా ఉండనుంది. ప్రస్తుతం బోట్స్‌మెన్ సొసైటీలతో కుదిరిన ఒప్పందం మేరకు జిల్లాలో టన్ను ధర నిర్ణయించి ఆపై రవాణా చార్జీలతో ఇసుక సరఫరా కానుంది.

పన్నులు మామూలే

ప్రభుత్వానికి ర్యాంప్‌ల నుంచి లాభసాటి లేకుండా ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేస్తున్నారు. సీనరేజీ, జీఎస్టీ, ఇతర పన్నులు మామూలుగా ఉంటాయి. ర్యాంప్‌లు, రీచ్‌ల వద్ద బిల్లులు ఇచ్చేందుకు అవసరమైన వ్యయాన్ని వసూలు చేస్తారు. ఆ మొత్తాన్ని కలుపుకొని టన్ను ధర నిర్ణయిస్తారు. దానిపై దూరాన్ని బట్టి రవాణా వ్యయం ఉంటుంది. వైసీపీ హయాంలో ఇసుక దందా అంతా ఇంతా కాదు. ప్రైవేటు ఏజెన్సీలకు ప్రభుత్వం ఇసుక తవ్వకాల బాధ్యతను అప్పగించింది. లెక్కా పత్రం లేకుండా తవ్వకాలు సాగించి సీనరేజీ, పన్నులు చెల్లించలేదు. ర్యాంప్ చార్జీలంటూ అదనంగా వసూలు చేశారు. వైసీపీ నేతలు భారీగా లబ్ధిపొందారు. తాజాగా ప్రభుత్వం ఉచిత ఇసుక విధానం అమలు చేయడంతో ప్రభుత్వానికి వెళ్లాల్సిన సీనరేజీ, జీఎస్టీ, ఇతర వ్యయాలను వసూలు చేసి ప్రభుత్వానికి ఇసుక వల్ల వచ్చే లాభం లేకుండా పంపిణీ చేయనున్నారు. దీనివల్ల వైసీపీ ప్రభుత్వం కంటే తక్కువ ధరకే ఇసుక లభ్యమయ్యే అవకాశం ఉంది.


తాడేపల్లిగూడెంలోని జగనన్న కాలనీ

జగనన్న కాలనీల్లో జగడం

- స్థలాలు విక్రయించిన లబ్ధిదారులు
- దళారుల దందాతో నిత్యం తగాదాలు

తాడేపల్లిగూడెం రూరల్, జూలై 7: జగనన్న కాలనీల్లో పలువురు లబ్ధిదారులు ఇల్లు కట్టుకునే స్తోమత లేక వేరొకరికి విక్రయించారు. దళారీ జోక్యంతో లబ్ధిదారులు. ప్రభుత్వం ఇచ్చిన పట్టాతోపాటు స్టాంపు పేపర్‌పై విక్రయించినట్టు ఒప్పందం రాసుకుంటున్నారు. ఇంటి నిర్మాణం చేపడితే రుణ మొత్తంలో నగదు లబ్ధిదారుకు, ప్రభుత్వం అందించే సిమెంటు ఐరెన్ కొనుగోలుదారుకు ఇచ్చేలా ఒప్పందం కుదుర్చుకున్నారు. మెటీరియల్ (ఇసుక, సిమెంటు, ఐరెన్) పొందడంలో దళారీ కీలకంగా వ్యవహరించి కొనుగోలుదారుకు ఇవ్వకుండా దళారి దండుకున్నాడు. ప్రభుత్వం పట్టాతో పాటు మరో రిజిస్ట్రేషన్ పట్టా రావడంతో స్థలం లబ్ధిదారు, కొనుగోలుదారు మధ్య అసలు జగడం జరుగుతోంది. మరికొంత సొమ్ము ఇస్తే కానీ అసలు పట్టా (రిజిస్ట్రేషన్) ఇవ్వనంటున్నారని దళారి దందా సాగిస్తున్నాడు.

తాడేపల్లిగూడెంలో 10 లేఅవుట్‌లలో 3500 మందికి స్థలం అందించగా 2వేలకు పైగా స్థలాలు ఇతరులకు విక్రయించారు. వాటిలో ప్రతీ 10 మందిలో ఒకరు వివాదంలో ఉంటున్నారు. అధికారులు దళారులకు వంత పాడుతున్నారనే ఆరోపణలున్నాయి. లబ్ధిదారులు సంతకం చేసిన కాగితాలు పట్టుకెళితే చాలు మెటీరియల్ ఇచ్చేస్తారనే భావనతో దళారులకు మూడు పూలు ఆరు కాయలు అన్న చందంగా తయారైంది.

మారుబేరాల మారాజు..

జగనన్న కాలనీల్లో ఓ మారుబేరాల మారాజు లక్ష రూపాయలతో పది సైట్‌లకు పది వేలు చొప్పున అడ్వాన్స్‌లు ఇచ్చాడు. తాను రూ.లక్షకు బేరమాడి మరొకరికి లక్షా 50 వేలకు ఆ స్థలాన్ని విక్రయిస్తున్నాడు. అంతేకాదు లబ్ధిదారుకు లేదా కానీ కొనుగోలుదారుకు చెందాల్సిన మెటీరియల్ అడ్డంగా లాక్కుంటూ జేబులు నింపుకోవడం పరిపాటిగా మారింది. ఈ మూడేళ్లలో జగనన్న కాలనీలో వందకు పైనే ఈ తరహా వ్యాపారం చేసి కోట్ల రూపాయలు దండుకున్నట్లు అంచనా. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీ నాయకుడికి దగ్గరవుతాడని, దీనితో కోట్ల రూపాయలు దండుకున్నా ఎవరూ పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.



లక్ష్మీపురం ఆలయం నుంచి బయలుదేరిన జగన్నాథుడి రథం

కదిలిన జగన్నాథ రథచక్రాలు

ద్వారకాతిరుమల, జూలై 7: శ్రీజగన్నాథుని దివ్య రథచక్రాలు లక్ష్మీపురం ఆలయం నుంచి శ్రీవారి క్షేత్రం వైపునకు కదిలాయి. శోభాయమానంగా ఆదివారం సాయంత్రం జరిగిన రథయాత్రను వీక్షించిన భక్తజనులు పరవశించారు. అతిపురాతన మైన ఈ ఆలయం శ్రీవారి ప్రధాన ఆలయానికి దత్తత దేవాలయమై విరాజిల్లుతోంది. ఈ క్రమంలో జగన్నాథుని రథోత్సవాలు ఆదివారం నుంచి ప్రారం భమై ఈనెల 16 వరకు జరుగను న్నాయి. ఉత్సవాల ప్రారంభాన్ని పురస్కరించుకుని ఆలయాన్ని పుష్పమాలికలు, మామిడి తోరణాలు, విద్యుత్ దీపతోరణాలతో సుందరీకరించారు.

లక్ష్మీపురం ఆలయంలో రథోత్సవాలు ప్రారంభం

రథయాత్ర ఇలా..

అర్చకుల వేదమంత్రోచ్ఛరణల నడుమ పూరి క్షేత్రం నుంచి తెచ్చిన సుభద్ర, బలభద్ర, సమేత జగన్నాథుని దారు విగ్రహాలను అట్ట హాసంగా కోవెల నుంచి తెచ్చి రథంలో ఏర్పాటుచేసిన సింహాసనంపై ఉంచి అలంకరించారు. ఆలయ అధికారుల పూజల అనంతరం బలిహరణను సమర్పించి రథయాత్రను ప్రారంభించారు. మేళతాళాలు, సన్నాయి డప్పువాయిద్యాలు, పండితుల వేదమంత్రోచ్ఛరణలు, కోలాట భజనల నడుమ జగన్నాథ రథయాత్ర ద్వారకాతిరుమల క్షేత్రానికి చేరుకుంది. భక్తులు హారతులు పట్టారు. క్షేత్రంలో తిరుగాడిన అనంతరం రథం తిరిగి లక్ష్మీపురం ఆలయానికి చేరుకుంది.



మత్స్యావతారంలో జగన్నాథుడు

మత్స్యావతారంలో జగన్నాథుడు ఆదివారం భక్తులకు దర్శనమిచ్చారు. లక్ష్మీపురం ఆలయంలో ఆదివారం ఘనంగా ప్రారంభమైన జగన్నాథుని రథోత్సవాలను పురస్కరించుకుని స్వామివారు రోజుకో అలంకరణలో భక్తులకు దర్శనమిస్తారు. దీనిలో భాగంగా తొలిరోజున మత్స్యావతారంలో శంఖు, చక్రాలను ధరించి, గధదారియై భక్తజనులకు అభయహస్తాన్ని ప్రసాదిస్తున్నట్టు అలంకరణ చూపరులకు కనువిందు చేసింది.





కైకలూరు రథయాత్రలో భక్తులు ఊరేగుతున్న సుభద్ర, బలరామ సమేత జగన్నాథుడు

వైభవంగా కైకలూరు, వడాలిలో రథయాత్రలు

కైకలూరు/ముదినేపల్లి, జూలై 7: కైకలూరు ఇస్కాన్ రాధాకృష్ణ మందిరం ఆధ్వర్యంలో జగన్నాథ రథయాత్ర వైభవంగా నిర్వహించారు. కైకలూరు శ్యామలాంబ అమ్మవారి ఆలయం నుంచి రథయాత్రను భక్తుల కోలాహలం మధ్య ప్రారంభించారు. భక్తులు రథాన్ని లాగుతూ హరేకృష్ణ సంకీర్తన చేశారు. అనంతరం జరిగిన కోలాట ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. రథయాత్ర అనంతరం శ్యామలాంబ అమ్మవారి ఆలయ కళా మండపంలో స్వామి వారికి 56 రకాల ప్రసాదాన్ని (చప్పన్ భోగ) నివేదించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదాన్ని అందజేశారు. ముదినేపల్లి మండలం వడాలి గ్రామంలో ఉన్న సుభద్ర, బలరామ సహిత జగన్నాథస్వామి రథోత్సవం వైభవంగా జరిగింది. వడాలి దేవస్థానం వద్ద ప్రారంభమైన జగన్నాథుడి రథయాత్ర ముదినేపల్లి, పెయ్యేరు కాలనీ, శ్రీహరిపురం, సింగరాయపాలెం బావాజీ మఠం వద్దకు సుమారు పది కిలోమీటర్లు కొనసాగింది. దారి పొడవునా భక్తులు రథాన్ని లాగి స్వామికి పూజలు నిర్వహించారు.

విశాఖ రైలుకు రెడ్ సిగ్నల్

- పునరుద్ధరణపై రైల్వే కుంటిసాకులు
- ఆరు నెలలుగా ప్రయాణికులకు ఇబ్బందులు
- కేంద్ర మంత్రులు, ఎంపీల వద్దకు సమస్య



నరసాపురం, జూలై 7 :నరసాపురం-మచిలీపట్నం-విశాఖపట్నం వయా భీమవరం మీదుగా నడిచే లింకు ఎక్స్‌ప్రెస్ నిలుపుదల చేసి ఆరు నెలలు గడుస్తుంది. అప్పట్లో ట్రాక్ పునరుద్దరణ పేరుతో ఈ రైలును తాత్కాలికంగా ఆపుతున్నట్టు ప్రకటించారు. ఈవిధంగా ప్రతినెల పొడిగిస్తున్నారే తప్ప ఈ రైలుకు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడం లేదు. జిల్లా నుంచి రాత్రి సమయంలో విశాఖ వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో నరసాపురం నుంచి పగటిపూట విశాఖకు సింహాద్రి ఎక్స్‌ప్రెస్ ఉండేది. ఆ లింకును పూర్తిగా తొలగించారు. తాజాగా నరసాపురం మచిలీపట్నం లింకు ఎక్స్‌ప్రెస్‌ను కూడా నిలుపుదల చేయడంతో ఈ రైలు ఇక పట్టాలెక్కదేమో అనే సందేహాలు వినిపిస్తున్నాయి.

పశ్చిమ గోదావరి జిల్లాలోని ఉండి, భీమవరం, పాలకొల్లు, నరసాపురం, తణుకు ప్రాం తాల్లో దశాబ్దల క్రితం ఉపాధి నిమిత్తం వచ్చి స్థిరపడిన వారు చాలాఎక్కువ మంది ఉన్నారు. ఇటు అన్నవరం క్షేత్రానికి వెళ్లే ప్రయాణికులు కూడా ఎక్కువే. ఆర్టీసీ బస్సులు ఉన్నప్పటికీ వందల రూపాయల్లో చార్జీలు ఉండడంతో ఎక్కువ మంది ప్రయాణికులు ఈ రైళ్లల్లోనే వెళ్లేందుకు ఇష్టపడతారు. గతంలో ఉదయం పది గంటలకు సింహాద్రి ఎక్స్‌ప్రెస్ ఎక్కితే సాయంత్రం ఆరు గంటలకు విశాఖ వెళ్లేవారు. అప్పట్లో చార్జీ వంద రూపాయలు ఉండేది. అన్నవరానికి రూ.75 ఉండేది. ఈ రైలును రద్దు చేసి నరసాపురం నుంచి దీనికి డెమో రైలు పెట్టారు. ప్రయాణికులు నిడదవోలు దిగి గుంటూరు నుంచి వచ్చే సింహాద్రి ఎక్కాల్సి వస్తుంది. కొన్ని సమయాల్లో ప్లాట్‌ఫాంలు మారాల్సి రావడంతో వృద్ధులు, చిన్న పిల్లలతో వెళ్లే వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆ రైలులో సీట్లు దొరకని పరిస్థితి. ఈ కష్టాలు పడలేక చాలామంది నరసాపురం నుంచి రాత్రి పదకొండు గంటలకు వెళ్లే లింకు ఎక్స్‌ప్రెస్‌లో విశాఖ, అన్నవరం తదితర ప్రాంతాలకు ప్రయాణమవు తున్నారు. ఈ ఏడాది ఆరంభంలో ట్రాక్ పనుల పేరుతో రద్దు చేశారు. అప్పటి నుంచి ఇదిగో... అదిగో అంటూ రైల్వే కుంటి సాకులు చెప్పుతున్నారే తప్ప రెడ్‌సిగ్నల్ మాత్రం తీయడం లేదు. దీనిపై నరసాపురం, భీమవరం, తణుకు, పాలకొల్లు తదితర ప్రాంతాల్లో రైల్వే అధికారులకు ప్రయాణికులతో పాటు పలు సంఘాలు వినతిపత్రాలు ఇచ్చినప్పటికీ స్పందన లేదు.

కేంద్ర మంత్రుల దృష్టికి..

కేంద్రం, రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం రావడంతో జిల్లాలో స్థిరపడిన ఉత్తరాంధ్ర వాసులు ఈ సమస్యను కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మతో పాటు శ్రీకాకుళం జిల్లాకు చెందిన కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు, విజయనగరం ఎంపీ అప్పలనాయుడు దృష్టికి తీసుకెళ్లారు. రైల్వే అధికారుల దృష్టికి తీసుకెళ్లి ఈఎక్స్‌ప్రెస్‌ను పునరుద్ధరించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. త్వరలో వీరంతా రైల్వే మంత్రిని కలవనున్నట్టు తెలియవచ్చింది. అప్పటికైనా ఈ రైలు రెగ్యులర్‌గా నడుస్తోందా లేదా మళ్లీ మూడునాళ్ళతో సరిపెడతారా అనేది సస్పెన్స్‌గా మారింది.

అండర్-19 జిల్లాస్థాయి చెస్ విజేతలు

భీమవరం అర్బన్, జూలై 7: జిల్లాస్థాయి అండర్-19 చెస్ పోటీలు అనసూయ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ చెస్ అసోసియేషన్ సహకారంతో ఆదివారం భీమవరం అనసూయ చెస్ అకాడమిలో నిర్వహించారు. పోటీలకు జిల్లాల నలు మూలల నుంచి సుమారు 30మంది చెస్ క్రీడాకారులు పాల్గొన్నారు. పోటీలలో మొదటిస్థానం ఎన్.వరుష్‌తేజ్, రెండో విజేతగా ఎ.శివసాయి కార్తీక్, మూడో స్థానంలో ఈ.దేహన్ష, నాలుగో స్థానంలో ఎన్.కుష్వంత్ నిలిచారన్నారు. వీరు ఈనెల 18, 19వ తేదీల్లో నంద్యాలలో జరిగే రాష్ట్రస్థాయి అండర్-19 చెస్ పోటీలలో పాల్గొంటారని చెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మాదాసు కిషోర్ తెలిపారు. మొదటి నాలుగు స్థానాల్లో నిలిచిన క్రీడాకారులకు చెస్ అసోసియేషన్ సభ్యులు మైలాపురి మురళి, నోముల రామారావు చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు, బహుమతులు అందించారు.



చెస్ విజేతలతో అసోసియేషన్ సభ్యులు

సెప్టెంబరులో జాతీయ స్థాయి కరాటే పోటీలు

ఏలూరు రూరల్, జూలై 7: ఆత్మరక్షణకు కరాటే దోహదపడుతుందని ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. సెప్టెంబరు 14,15వ తేదీల్లో బడేటి ఛాలెంజ్ కప్ పేరుతో ఆంధ్రప్రదేశ్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో జాతీయస్థాయిలో కరాటే పోటీలు నిర్వహిస్తున్నారు. ఆదివారం స్థానికంగా పోటీలకు సంబంధించి టోర్న మెంట్ కప్‌ను ముఖ్యఅతిథిగా ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. క్రీడల్లో రాణిస్తే ఉద్యోగ అవకాశాలు పొందవచ్చన్నారు. విద్యార్థులను రాష్ట్ర, జాతీయస్థాయి కరాటేలో పాల్గొనేలా శిక్షణ ఇస్తున్న ఇబ్రహీమ్‌బేగ్, సెహన్షాలను అభినందించారు ఇండియా కరాటే చీఫ్‌కోచ్ ఇబ్రహీమ్‌బేగ్ మాట్లాడుతూ రెండేళ్లకొకసారి జాతీయస్థాయిలో కరాటే పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ ఏడాది 15వ సారి ఏలూరు సీఆర్‌రెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో పోటీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. 15 రాష్ట్రాల నుంచి క్రీడాకారులు హాజరవుతారన్నారు. కార్యక్రమంలో నాదం శివ, కవులూరి చంద్రశేఖర్, ఈతకోట శ్రీనివాసరావు, బెల్లంకొండ కిషోర్, అమరావతి అశోక్‌బాబు, కరాటే మాస్టర్లు రాధా, పలువురు ఇన్‌స్ట్రక్టర్లు పాల్గొన్నారు.



కప్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బడేటి చంటి

విస్తృతంగా వాహనాల తనిఖీ

ఏలూరు క్రైం, జూలై 7 : ఏలూరు జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి ఆదేశాలతో జిల్లాలో ఉన్న పోలీసులు శనివారం అర్ధరాత్రి నుంచి ఆదివారం తెల్లవారుజాము వరకూ విస్తృతంగా వాహనాలను తనిఖీ చేశారు. రాత్రి వేళ రోడ్డు ప్రమాదాలు జరగకుండా వాహన డ్రైవర్లకు ఫేస్‌వాష్ కార్యక్రమాన్ని నిర్వహించారు. బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, లాడ్జీలలో అనుమానాస్పదంగా ఉన్న వారిని ప్రశ్నించారు. ప్రార్థనాల యాలు, బ్యాంకులు, ఏటీఎంల వద్ద ఏ విధమైన అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా ముందస్తుగా రాత్రిపూట ఆ ప్రాంతాలను తనిఖీలు చేశారు. గంజాయి, సారా, అక్రమ మద్యం రవాణా జరగకుండా జాతీయ, రాష్ట్రీయ రహదారులపై విస్తృతంగా వాహనాలను తనిఖీలు చేశారు. ద్విచక్ర వాహనదా రులకు హెల్మెట్ ధారణపై అవగాహన కల్పించారు. హెల్మెట్లు ఉండడం వల్ల ప్రాణాలు కాపాడుకోవచ్చని సూచించారు.



వాహన డ్రైవర్‌ను ప్రశ్నిస్తున్న నిడమర్రు సీఐ ఎంవీ సుభాష్

మతిస్థిమితం లేని వ్యక్తి హల్‌చల్

భీమవరం క్రైం, జూలై 7 : భీమవరం టూటౌన్‌లోని టౌన్ రైల్వేస్టేషన్ రోడ్డులో ఆదివారం ఓ వ్యక్తి కర్ర పట్టుకుని జనాన్ని భయభ్రాంతులకు గురిచేశాడు. కనిపించినవారిని కొట్టడంతో స్థానికులు ఆందోళన చెందారు. ఎస్ఐ జీకే ప్రసాద్, సిబ్బంది వెళ్లి అతడిని అడ్డుకున్నారు. మతిస్థిమితం లేకపోవడం కారణమని గతంలో ఇలాగే ప్రవర్తించేవాడని స్థానికులు చెప్పారు.

ప్రత్తిపాడులో జనసైనికుల స్వచ్ఛ భారత్

పెంటపాడు, జూలై 7: ప్రత్తిపాడులో ఆదివారం జన సైనికులు స్వచ్ఛభారత్ నిర్వహించారు. జనసేన గ్రామ అధ్యక్షుడు చెరుకూరి జగత్ సోమశేఖర్ ఆధ్వర్యంలో బీసీ కాలనీలో డ్రెయినేజీలు శుభ్రం చేయడంతో పాటు, ప్రాథమిక పాఠశాల ఆవరణ మెరక వేయడం, పార్క్‌లో తుప్పలను తొలగించారు. గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మజ్జి అప్పారావు, బీజేపీ నాయకుడు ఆరాధ్యుల అంజి, పెనుమాక బాబు, దేవదానం తదితరులు పాల్గొన్నారు.

వాస్తవ పరిస్థితులకు ప్రతిబింబాలే నాటికలు

- నాలుగో రోజు రసవత్తరంగా సాగిన పోటీలు

ఏలూరు రూరల్, జూలై 7 : భారతీయ సంస్కృతి, సంప్రదాయాలతో పాటు వాస్తవ పరిస్థితులను కళ్లకు కట్టినట్టు చూపించే ప్రతిబింబాలే నాటికలు అని హేలాపురి కళాపరిషత్ అధ్యక్షుడు పెదపాటి రామకృష్ణ అన్నారు. వైఎంహెచ్ఏ హేలాపురి కళాపరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు స్మారక రాష్ట్రస్థాయి నాటికపోటీలు నాలుగో రోజు ఆదివారం అలరించాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజాన్ని మేల్కొల్పడంలో నాటికలు కీలకపాత్ర పోషిస్తున్నాయన్నారు. నాటిక పోటీలు రసవత్తరంగా సాగుతున్నాయి.

'కౌసల్య సుప్రజరామ' నాటిక..

కొలకలూరి శ్రీసాయి ఆర్ట్స్ వారిచే 'కౌసల్య సుప్రజరామ' నాటిక ప్రదర్శించారు. రామాయణంలో రాముడు అరణ్యానికి వెళుతుంటే భర్త దశరథుడి మీద గౌరవంతో కుమారుడి అరణ్య ప్రయాణాన్ని కౌసల్య ఎలా అడ్డుకోలేక పోయిందో కలియుగంలో కూడా ఉద్యోగాల పేరిట విదేశాలకు వెళుతున్న పిల్లలను అడ్డుకోలేకపోతున్నారనే ఇతివృత్తంతో నాటిక సాగింది. అమ్మమనసు మాత్రం బిడ్డలను ఎప్పుడూ అంటిపెట్టుకునే ఉంటుంది. బిడ్డల కష్టాలకు, కన్నీళ్ళకు ఓదార్పుగా నిలబడుతూనే ఉంటుంది. అమ్మ మనస్సుకు ఒక ధర్మం ఉందని, అది కనిపెంచిన ధర్మం, అది కనిపించని ధర్మం అంటూ అమ్మగొప్పతనాన్ని మనస్సుకు హత్తుకునేలా వివరించారు. స్నిగ్ధా రచించిన ఈ నాటకానికి గోపరాజు విజయ్ దర్శకత్వం వహించారు. అనంతరం వి.రామాంజనేయులచే మయసభ ఏకపాత్రాభినయం, మండవ రాజాగోపాలకృష్ణ సంబరాతుల ఏకపాత్రాభినయం, పి.విజయ్‌కుమార్, డి.రంగారావులచే రామభక్త హనుమాన్ పద్యనాటిక అలరించింది. ఈ కార్యక్రమానికి కేబీరావ్, ఎం.డి.ఖాజావలీ, గుత్తా కౌసలేంద్రరావు, చెన్నా వెంకటరామయ్య, వైఎంహెచ్ఏ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.







కౌసల్య సుప్రజరామ నాటిక.. మయసభ ఏకపాత్రాభినయం.. రామభక్త హనుమాన్‌లో సన్నివేశాలు

మార్మోగిన గోవింద నామస్మరణ

- శ్రీవారి క్షేత్రానికి తరలివచ్చిన 20 వేల మంది భక్తులు

ద్వారకాతిరుమల, జూలై 7: గోవింద నామస్మరణతో చిన్నతిరుమలేశుని క్షేత్రం మార్మోగింది. ఆషాఢమాసంలో ఆదివారం నెలపొడుపు కావడంతో పాటు అందరికీ సెలవు దినం కావడంవల్ల అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చారు. ఆలయ పరిసరాల్లో ఆధ్యాత్మికత వెల్లువిరిసింది. ఆలయానికి దాదాపు 20 వేల మంది పైబడి యాత్రికులు వచ్చి స్వామి, అమ్మవార్లను దర్శించినట్టు ఆలయవర్గాలు భావిస్తున్నాయి. ఆలయానికి వచ్చిన పలువురు భక్తులు ముందుగా కేశ ఖండనశాలలో మొక్కుబడులు తీర్చుకున్నారు. సాధారణ దర్శనానికి రెండు గంటల పైబడి సమయం పట్టింది.

అలరించిన కోలాట ప్రదర్శన

చినవెంకన్న ఆలయ శ్రీహరి కళాతోరణ వేదికపై మహిళలు, బాలలు ఆధ్వర్యంలో జరిగిన కోలాట ప్రదర్శన చూపరులను అలరించింది. సంప్రదాయ దుస్తులను ధరించిన వారు ముందుగా ఆలయంలోకి వెళ్లి స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు జరుపుకున్నారు. అనంతరం కళాతోరణ వేదికపై చేరి పలు దేవతామూర్తులను కీర్తిస్తూ వారు నిర్వహించిన కోలాటప్రదర్శన భక్తులను అబ్బురపరిచింది.



శ్రీవారి దర్శనానికి క్యూకాంప్లెక్స్‌లో వున్న భక్తులు



మహిళలు, బాలల కోలాట ప్రదర్శన



బురదమయంగా మార్కెట్ రోడ్లు

మార్కెట్ బురదమయం

తాడేపల్లిగూడెం రూరల్, జూలై 7:తాడేపల్లిగూడెం మార్కెట్ బురదమయంగా మారింది. ఆదివారం కూరగాయల మార్కెట్ కొనుగోలుదారులతో కిటకిటలాడగా రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రోడ్లన్నీ బురదమయం అయ్యాయి. మార్కెట్‌లో చెత్త ఇష్టారాజ్యంగా వదిలేయడంతో దుర్గంధం వెదజల్లుతోంది. వినియోగదారులు కనీసం నడవడానికి కూడా వీలులేకుండా రోడ్లు ఛిద్రంగా మారాయి. మున్సిపల్ అధికారులు మార్కెట్ రోడ్లు బురదలేకుండా శుభ్రం చేయించాలని పలువురు కోరుతున్నారు.

మోటారు సైకిల్ అపహరణ

ఉంగుటూరు, జూలై 7:ఉంగుటూరు మండలం చేబ్రోలు గ్రామంలో అచ్యుత గంగాధరరావుకు చెందిన మోటారు సైకిల్ ఇంటి వద్ద నిలుపగా శనివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తి తస్కరించినట్టు తెలిపారు. ఈ మేరకు బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చేబ్రోలు ఎస్ఐ ఎ.మణికుమార్ ఆదివారం తెలిపారు.

పరారీలో ఉన్న గంజాయి నిందితుడి అరెస్టు

ఏలూరు క్రైం, జూలై 7 : గంజాయి రవాణా కేసులో తప్పించుకుని అప్పటి నుంచి పరారీలో ఉన్న ఓ నిందితుడిని ఏలూరు వన్‌టౌన్ సీఐ ఎన్.రాజశేఖర్, ఏలూరు రూరల్ ఎస్ఐ కె.రాజారెడ్డి వారి సిబ్బంది ఆదివారం రాత్రి అరెస్టు చేశారు. 2020లో ఏలూరు రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గంజాయి రవాణా చేస్తున్న వారిని అరెస్టు చేయగా ఓ వ్యక్తి పారిపోయాడు. పారిపోయిన వ్యక్తి విశాఖపట్టణం జిల్లా రోలుగుంట మండలం భూపాలపట్నంకు చెందిన గోడె పసుపతి అలియాస్ రమణ అప్పటి నుంచి పోలీసులకు చిక్కకుండా తప్పించుకు తిరుగుతున్నాడు. ఎస్పీ మేరీ ప్రశాంతి ఇటీవల నేర సమీక్ష సమావేశం నిర్వహించి గంజాయి కేసుల్లో నిందితులను అరెస్టు చేయాలని ఆదేశాలు ఇచ్చారు. ఈ క్రమంలో ఏలూరు డీఎస్పీ ఈ శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి గోడె పసుపతి అలియాస్ రమణను అరెస్టు చేశారు.



పోలీసులు అరెస్టు చేసిన గంజాయి కేసులో నిందితుడు

ఇద్దరిపై కేసు

ఉండి, జూలై 7: ఇరువురు వ్యక్తులపై కేసులు నమోదు చేసిన ఘటన ఉండిలో జరిగింది. ఆదివారం పోలీసులు తెలిపిన వివరాలివి.. ఉండిలో ఇసుకదొడ్డి ప్రాంతానికి చెందిన సర్వసిద్ధి అప్పన్న అదే ప్రాంతానికి చెందిన సామంతులు మాధవి ఘర్షణ పడ్డారు. ఒకరిపై మరొకరు పోలీసులకు ఫిర్యాదు చేసుకున్నారు. ఈ మేరకు ఇరువురు వ్యక్తులపై కేసు నమోదు చేశామని హెడ్ కానిస్టేబుల్ ఎస్సయ్య తెలిపారు.

భారీ తోటకూర మొక్క

- గొల్లలకోడేరులో 11 అడుగులకు ఎదిగిన వైనం

పాలకోడేరు, జూలై 7: తోటకూర అంటే ఇష్టపడని వారుండరూ, చూడని వారు ఉండరు కానీ పదకొండు అడుగుల ఎదిగిన తోటకూర మొక్కను అతితక్కువ మంది మాత్రమే చూసుంటారు. పాలకోడేరు మండలం గొల్లలకోడేరుకు చెందిన మాజీ సర్పంచ్ గాదిరాజు వెంకటసత్యసూర్యనారాయణరాజు నివాసంలో ఈ మొక్క కనువిందు చేస్తోంది. రెండు నెలలక్రితం పెరట్లో తోటకూర విత్తనాలు వేయగా అందులో ఒక మొక్క అబ్బురపరిచే విధంగా పదకొండు అడుగులు పెరిగింది. ఇంటికి వచ్చిన పలువురు ఆశ్చర్యం వ్యక్తం చేస్తూ ఫొటోలు దిగి వెళ్తున్నారు.



తోటకూర మొక్కతో మాజీ సర్పంచ్ సూర్యనారాయణరాజు

వావ్..

రోడ్డుపైకి గురస చేపలు

- పోలవరంలో కురిసిన భారీ వర్షం..

పోలవరం జూలై 7 : పోలవరంలో ఆదివారం ఉదయం భారీ వర్షం కురిసింది. స్థానిక బెస్తావీధిలో వర్షపు నీటికి బోదెల్లో చేపలు రోడ్లపైకి ఎదురెక్కడంతో స్థానికులు చేపలను పట్టుకుని కవర్లలో తీసుకువెళ్లారు. సుమారు రెండు బస్తాల గురస చేపలు స్థానికులు ఏరుకుని పట్టుకుని ఇళ్లకు వెళ్లారు. మండలంలో గూటాల, కొత్తపట్టిసీమ, పట్టిసీమ, పోలవరం, ఇటుకలకోట, తదితర పంచాయతీలలో పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. పోలవరం మెయిన్ రోడ్డు, బెస్తావీధి, కొత్తపేట, బాపూజీ కాలనీలలో డ్రెయినేజీ వ్యవస్థ సరిలేక నీరు నిలిచిపోవడంతో ప్రజానీకం అవస్థలకు గురయ్యారు.



రోడ్డుపైకి చేరిన చేపలు



స్థానికులు కవర్లలో వేసుకున్న చేపలు

క్రైం కార్నర్

శ్రీరామవరంలో ఫ్లెక్సీ వివాదం.. ఉద్రిక్తత

టీడీపీ బ్యానర్‌ను చింపారని.. వైసీపీ.. టీడీపీ శ్రేణుల మధ్య తోపులాట

దెందులూరు, జూన్ 7 :దెందులూరు మండలం శ్రీరామవరం గ్రామంలో ఆదివారం గుర్తుతెలియని వ్యక్తులు టీడీపీ బ్యానర్‌ను చింపివేశారు. ఈ మేరకు వైసీపీ.. టీడీపీ కార్యకర్తల మధ్య ప్రారంభమైన వివాదం ఉద్రిక్తతకు దారి తీసింది. ఇరువర్గాల కార్యకర్తల మధ్య తోపులాట జరిగింది. సమాచారం తెలుసుకున్న దెందులూరు ఎస్ఐ స్వామి, సీఐ కొండశీనివాస్, పోలీసులు బందోబస్తుతో వచ్చి అదుపు చేశారు. సోమవారం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి కార్యక్రమం ఉండడంతో వైసీపీ నాయకులు గుమిగూడడంతో పాటు తమ ఫ్లెక్సీని చింపారని టీడీపీ.. వైసీపీ కార్యకర్తల మధ్య కొద్దిసేపు రాళ్ల రువ్వుకున్నారు. ఇరువర్గాలను పోలీసులు చెదరగొట్టి అక్కడ నుంచి పంపిం వేశారు.

ఆన్‌లైన్ యాప్‌లో రూ.93.55 లక్షలు మాయం

- మోసపోయిన మహిళ.. చీటింగ్ కేసు నమోదు

ఏలూరు క్రైం, జూలై 7 :ఆన్‌లైన్ యాప్ ద్వారా దఫదఫాలుగా 93 లక్షల 55 వేల 500 రూపాయలు పెట్టుబడిపెట్టి ఆపై మోసపోయానని భావించిన ఒక మహిళ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. ఏలూరు శాంతినగర్‌కు చెందిన ఎ.నవ్యలక్ష్మి వాట్సాప్‌కు 2023 డిసెంబరు 26న ఎ.చంద్రశేఖర్ అనే వ్యక్తి నంబరు ద్వారా పాంథసెస్ యాప్ డౌన్‌లోడ్ చేసుకుని పెట్టుబడులు పెడితే రెట్టింపు అవుతాయని మెసేజ్ పెట్టడంతో వాటిని నమ్మి దఫదఫాలుగా ఇప్పటివరకు 93 లక్షల 55 వేల 500 రూపాయలు పెట్టుబడి పెట్టారు. సొమ్ములు ఎప్పటికీ తిరిగి రాకపోవడంతో అనుమానం కల్గి ఆ ఫోన్ నంబరుకు ప్రయత్నించగా స్విచ్‌ఆఫ్‌లో ఉంది. ఈ మేరకు బాధితురాలు ఏలూరు త్రీటౌన్ పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పది మంది జూదరుల అరెస్ట్

ఉంగుటూరు, జూలై 7:చేబ్రోలు పోలీసు స్టేషన్ పరిధిలో పేకాటాడుతున్న పది మందిని అరెస్ట్ చేశామని చేబ్రోలు ఎస్ఐ ఎ.మణికుమార్ తెలిపారు. ఆదివారం నారాయణపురం శివారులో పేకాటాడుతున్నట్టు సమాచారం రావడంతో సిబ్బందితో దాడి చేశామన్నారు. దాడిలో పది మందిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ2200 నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.


గడ్డపారతో గాయపర్చిన మహిళపై కేసు

టినరసాపురం, జూలై 7 : రెండు ఇళ్ల మధ్య వర్షపు నీటి ప్రవాహంపై జరిగిన ఘర్షణలో ఒక మహిళను కొట్టిన మరో మహిళపై కేసు నమోదు చేశామని ఎస్ఐ డి.దుర్గామహేశ్వరరావు తెలిపారు. వల్లంపట్ల పంచాయతీ శింగరాయపాలెంలో ముళ్ళగిరి భవాని, జక్కం రాధ ఇళ్ల మధ్య వర్షపు నీటి ప్రవాహానికి సంబంధించి శనివారం ఇద్దరు మహిళలు ఘర్షణ పడ్డారు. కోపోద్రిక్తురాలైన భవాని గడ్డపారతో రాధను కొట్టడంతో గాయమైంది. బాధితురాలిని కుటుంబ సభ్యులు జంగారెడ్డిగూడెం ఆసుపత్రిలో చేర్చారు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారంతో ఆదివారం భవానిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

షిరిడీ వెళ్లొచ్చేసరికి ఇంటిని దోచేశారు

మొగల్తూరు, జూలై 7 : మోడి గ్రామంలోని ఓ ఇంటిలో చోరీ జరిగిందని బాధితుడు ఆదివారం మొగల్తూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మోడి పంచాయతీకి చెందిన వన్నెంరెడ్డి కేశవరాయుడు ఈనెల 3వ తేదీన కుటుంబ సభ్యులంతా కలిసి షిరిడీ వెళ్లారు. అక్కడ నుంచి ఆదివారం ఉదయం ఇంటికి చేరుకున్నారు. ఇంటికి వచ్చే సరికి ఇంటి తాళాలు పగులకొట్టి ఉండడంతో పాటు ఇంటిలోని బీరువా తాళాలు పగులుకొట్టి దుండగలు ఐదు కాసుల బరువు గల మూడు బంగారు చైన్‌లు, నాలుగు గ్రాముల రూపు, వెండి సామగ్రిని దొంగిలించినట్టు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. పోలీసులు క్లూస్ టీం ద్వారా వివరాలు సేకరిస్తున్నారు.

మోటారు సైక్లిస్టుకు తీవ్ర గాయాలు



జీలుగుమిల్లి, జూలై 7 : రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలైన ఘటన జీలుగుమిల్లి శివారు రమణక్కపేట వద్ద ఆదివారం రాత్రి జరిగింది. జీలుగుమిల్లి శివారు రమణక్కపేట వద్ద జాతీయ రహదారిపై బైక్‌పై వెళుతూ ఓ వ్యక్తి ప్రమాదానికి గురయ్యాడు. తీవ్ర గాయాలపాలై రక్తపు మడుగులో అపస్మారక స్థితిలో ఉన్న అతడిని స్థానికులు చూసి 108కు సమాచారం ఇచ్చారు. జీలుగుమిల్లి 108 వాహనంలో మెరుగైన వైద్యం కోసం జంగారెడ్డిగూడెం ఆస్పత్రికి తరలించారు. తూర్పు గోదావరి జిల్లా గోపాలపురానికి చెందిన షేక్ సమీర్‌గా పోలీసులు గుర్తించారు. ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

కేంద్ర మంత్రిని కలసిన కలెక్టర్



భీమవరం టౌన్, జూలై 7 : కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మను ఆదివారం జిల్లా కలెక్టర్ సి. నాగరాణి భీమవరంలోని కేంద్ర మంత్రి ఇంటివద్ద మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కొద్దిసేపు జిల్లా అభివృద్ధిపై చర్చించారు.

ముమ్మరంగా ఆకుమడులు

నరసాపురం రూరల్, జూలై 7: ప్రస్తుతం తీర ప్రాంతంలో జోరుగా వర్షాలు కురుస్తున్నందున రైతులు త్వరితగతిన ఆకుమడులు వేసుకోవాలని ఏవో డాక్టర్ రాజశేఖర్ తెలిపారు. ఇప్పటికే చిట్టవరం, కొప్పర్రు, సీతారాంపురం, రుస్తుంబాదా, సరిపల్లి, చినమామిడిపల్లి గ్రామాల్లో రైతులు ఆకుమడులు వేసుకున్నారన్నారు. ఆకుమడులు పూర్తవ్వగానే రైతులు నారుమడులు పూర్తి చేసుకోవాలని ఆయన కోరారు.

లేటెస్ట్ టెక్నాలజీ అధ్యయనం చేయాలి

భీమవరం ఎడ్యుకేషన్, జూలై 7 : వేగంగా మారుతున్న లేటెస్ట్ టెక్నాలజీని ఇంజనీరింగ్ కళాశాల అధ్యాపకులు అధ్యయనం చేసి విద్యార్థులకు అందించాలని ప్రముఖ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ నిపుణులు ఉమాదేశు అన్నారు. ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో వారం రోజుల పాటు జనరేటివ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రాంప్ట్ ఇంజనీరింగ్ అనే అంశంపై జరిగిన వర్క్‌షాప్ ఆదివారం ముగిసింది. వర్క్‌షాప్‌నకు ఏఐఎంఎల్ హెడ్ డా.జీవీవీజీ శిరీష అధ్యక్షత వహించారు. ఈసందర్భంగా ఏఐ నిపుణులు ఉమాదేశు మాట్లాడుతూ గతంలో టెక్నాలజీ మార్కెట్లోకి వచ్చేసరికి చాలా టైం తీసుకునేదని ప్రస్తుతం ఎంతో వేగంగా టెక్నాలజీ అందుబాటులోకి వస్తుందని పేర్కొన్నారు. కళాశాల డైరెక్టర్ డా.ఎం.జగపతిరాజు మాట్లాడుతూ ఇంజనీరింగ్ అధ్యాపకులు నిరంతరం నూతన టెక్నాలజీ వైపు దృష్టి కేంద్రీకరించాలని సూచించారు. అనంతరం కళాశాల ఉపాధ్యక్షులు ఎస్వీ రంగరాజు, ఏఐ నిపుణులు ఉమాదేశును ఘనంగా సత్కరించారు.

బట్టల వర్తక సంఘం కార్యవర్గం



పాలకొల్లు అర్బన్, జూలై 7: పాలకొల్లు క్లాత్ అండ్ మర్చంట్స్ అసోసియేషన్ (బట్టల వర్తక సంఘం) 80వ వార్షికోత్సవం, నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం ఆదివారం అసోసియేషన్ భవనంలో జరిగింది. సంఘ అధ్యక్షుడిగా వట్టం గణేశ్వరరావు (గణేష్), కార్యదర్శిగా సలాది జనార్దనరావు (జానీ), కోశాధికారిగా బీఏఎస్ సత్యనారాయణ, ఉపాధ్యక్షులుగా బొండాడ చినబాబు, ద్వారా ప్రభాకరరావు, సహాయ కార్యదర్శులుగా మానెం కోటేశ్వరరావు, శిగడం శ్రీనివాస్ ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో ఛాంబర్ తరపున కెవి సీతారామరాజు, బొండాడ వెంకట రత్నం, పూర్వాధ్యక్షులు మాచేపల్లి వెంకట్రావు, చాంబర్ అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ప్రతి గ్రామానికి సురక్షిత తాగునీరు: ఆరిమిల్లి



అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే ఆరిమిల్లి

తణుకు, జూలై 7: నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో ప్రజలకు రక్షిత తాగునీరు అందించాలని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. ఆదివారం క్యాంపు కార్యాలయంలో గ్రామీణ నీటి సరఫరా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడుతూ తాగునీటి పథకాలను మరింత పటిష్టంగా అమలు చేయాలని, ఎలాంటి అవాంతరాలున్నా వెంటనే పరిష్కరించాలని చెప్పారు.

ఇంటింటా వైద్య సేవలు

తణుకు, జూలై 7: సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిసా ఫౌండేషన్ సంయుక్తంగా సంచార శకటం ద్వారా ఇంటింటికి వెళ్లి వైద్య సేవలను అందిస్తున్న విషయం విదితమే. ఆదివారం ప్రముఖ నేత్ర వైద్యుడు డాక్టర్ హుస్సేన్ అహ్మద్, డాక్టర్ సాతులూరి అనుస్మిత తణుకు, పైడిపర్రు, వేల్పూరు, ప్రాంతాల్లో పర్యటించి ఇంటికే పరిమితమైన ఎనిమిది మందికి వైద్య సేవలందించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. సంఘ కార్యదర్శి అర్జి భాస్కరరావు, సభ్యులు గిరజాల నాగేశ్వరరావు, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రవీణ్ ప్రకాష్‌పై చర్యలు తీసుకోవాలి

తణుకు, జూలై 7: విద్యాశాఖ మాజీ ముఖ్య కార్యదర్శిగా పనిచేసిన ప్రవీణ్ ప్రకాష్‌కు స్వచ్ఛంద పదవీ విరమణ ఇవ్వరాదని ఏపీటీఎఫ్ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేసింది. ఉపాధ్యాయులను వేధించడంతో పాటు అనేక అక్రమాలకు పాల్పడ్డారని, ఇలాంటి వారు భవిష్యత్‌లో ఇంకా ఎలాంటి తప్పులు చేయకుండా చర్యలు తీసుకోవాలని సంఘం కోరుతున్నట్టు సంఘ రాష్ట్ర పూర్వకార్యదర్శి ఐ.రాజగోపాల్ తెలిపారు.

జనసేనలో చేరికలు

తాడేపల్లిగూడెం అర్బన్, జూలై 7: గోపాలపురం నియోజకవర్గానికి చెందిన పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఆ నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి సువర్ణ రాజు నేతృత్వంలో ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ సమక్షంలో జనసేనలో చేరారు. ఆదివారం స్థానిక జనసేన కార్యాలయం వద్ద ఎమ్మెల్యే బొలిశెట్టి వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అచ్యుత సత్యనారాయణ, దొండపాటి బాబు, ప్రగడ శ్రీను, గద్దె బాలగంగాధర్ తిలక్ తదితరులు పాల్గొన్నారు.

రఘురామకు టీటీడీ చైర్మన్ పదవి ఇవ్వాలి

అత్తిలి, జూలై 7: ఉండి ఎమ్మెల్యే, నర్సాపురం మాజీ ఎంపీ కనుమూరి రఘురామకృష్ణరాజుకు టీటీడీ చైర్మన్ పదవిని కేటాయించాలని అత్తిలికి చెందిన ఆయన అనుచరులు ఒక ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆధ్యాత్మిక భావాలు ఉన్న రఘురామకృష్ణరాజుకు ఈ పదవిని కేటాయించడం సముచితమని దిరిశాల మునేశ్వరరావు, పుప్పాల అర్జునరావు, వైట్ల శ్రీనివాసరాజు కోరారు.

విద్యతోనే భవిష్యత్

ఆచంట, జూలై 7: ప్రతి విద్యార్థికి విద్యతోనే మంచి భవిష్యత్తు ఏర్పడుతుందని వల్లూరు సర్పంచ్ నేలపూడి బేబి రామ్మోహనరావు అన్నారు. వల్లూరులో మహిళా జూనియర్ కళాశాల రెండవ సంవత్సరం విద్యార్థులు మొదటి సంవత్సరంలో చేరే విద్యార్థులకు ఫ్రెషర్స్‌డే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భీమలాపురం సర్పంచ్ మాధవరావు, పాఠశాల చైర్మన్ సుబ్బలక్ష్మి, వైస్ చైర్మన్ దొరబాబు, వైస్ ఎంపీపీ తాళం శ్రీనివాసరావు, ఎంపీటీసీ ఆరుమిల్లి సుబ్బారావు, ఉపసర్పంచ్ గెద్దాడ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సేవలో లయన్స్ కీలకపాత్ర



లయన్స్ మల్టీపుల్ కౌన్సిల్ సెక్రటరీ పంకజాక్షన్‌ను సన్మానిస్తున్న లయన్ ప్రముఖులు

ఆకివీడు, జూలై 7: సమాజ సేవలో కీలకపాత్ర పోషించేది లయనిజమని లయన్స్ ఏపీ చైర్మన్ సీహెచ్ కృష్ణంరాజు, మల్టీపుల్ కౌన్సిల్ సెక్రటరీ వికే పంకజాక్షమ్ అన్నారు. ఆదివారం స్థానిక వి కన్వెన్షన్ హాల్‌లో ఆకివీడు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కంబంపాటి లక్ష్మీనరశింహం, కార్యదర్శి గొట్టుముక్కల నారాయణరాజు (బాబు), కోశాధికారి ఎం.వీ.సుబ్బరాజు, గోల్డెన్ ఆక్వా లయన్స్ క్లబ్ అధ్యక్షుడు వేగేశ్న చిలకా రామరాజు, కార్యదర్శి కొప్పర్తి మణికంఠ మంగరాజు, కోశాధికారి పి.చిరంజీవిరాజు, చినకాపవరం లయన్స్ క్లబ్ అధ్యక్షుడు గొట్టుముక్కల జానకిరామరాజు, సెక్రటరీ బి.బాల కృష్ణ కోశాధికారి కె.వీ.సుబ్బారావులతో వారు ప్రమాణస్వీకారం చేయించి మాట్లాడారు. లయనిజం ద్వారా విద్యా, వైద్య, పర్యావరణకు పెద్దపీట వేశామన్నారు. లయన్స్ ప్రముఖులు వేగేశ్న వెంకట కృష్ణంరాజు, ఆర్వీ సూర్యనారాయణ రాజు, గుర్రం అరవింద్, సన్నిధి వెంకన్నబాబు, పిన్నమరాజు మురళీరాజు, చొప్పెర్ల బలరామ్, దాట్ల రామరాజు, ప్రసాద్, కంతేటి రామరాజు, భమిడిపాటి శ్రీనివాసరావు, కాకర్ల రాజరాజేశ్వరీ, జి.విజయ్, సూర్యనారాయణరాజు, కొయ్యా దొరబాబు, గొంట్ల కృష్ణమూర్తి పాల్గొన్నారు.









ధర్మవికాసం కార్యక్రమంలో ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు.. నరసాపురంలో క్రైస్తవుల సమావేశంలో ఎమ్మెల్యే నాయకర్.. పాలకొల్లులో మంత్రి నిమ్మలకు కళాకారుల సత్కారం.. తాడేపల్లిగూడెంలో క్రీడాకారులతో ఎమ్మెల్యే బొలిశెట్టి

సమాజం నా కుటుంబం అనే భావన రావాలి

ఎమ్మెల్యే రామాంజనేయులు

భీమవరం టౌన్, జూలై 7 : ధర్మాన్ని మనం కాపాడితే అదే ధర్మం మనల్ని కాపాడుతుందని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు అన్నారు. రెండో పట్టణంలోని 32 డెంటల్ కేర్ డాక్టర్ గౌతమ్ ఆధ్వర్యంలో ధర్మ వికాసం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే అంజిబాబు ప్రారంభించి మాట్లాడారు. నేటి తరంలో సమాజం నా కుటుంబం అనే భావన అందరిలో ఉండాలని, భావితరాలకు మన సంస్కృతి సాంప్రదాయాలు, నీతి నిజాయితి, భారతీయ ఔన్నత్యం తెలిసే విధంగా ఇటువంటి కార్యక్రమాలను నిర్వహించడం శుభ పరిణామమని అన్నారు. డాక్టర్ గౌతమ్ మాట్లాడుతూ పద్మభూషణ్ వరప్రసాద్ రెడ్డి సహకారంతో ధర్మ వికాసం ఏర్పాటు చేశామని, ప్రతి ఆదివారం వేద పండితులచే చిన్నారులకు సనాతన ధర్మాన్ని, మనిషి మనిషిగా ఎలా బతకాలి, తత్వ బోధన తదితర వాటిపై శిక్షణ అందిస్తామని తెలిపారు. డొక్కా సీతమ్మ పేరిట ఏడాదికి 8 వేల మందికి అన్నదానం చేస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో జనసేన పార్టీ పట్టణ అధ్యక్షుడు చెన్నమల చంద్రశేఖర్, వబిలిశెట్టి రామకృష్ణ, ఏఎంసీ మాజీ చైర్మన్ కోళ్ల నాగేశ్వరావు, గాదిరాజు తాతారాజు, వబిలిశెట్టి పట్టాభిరామయ్య, విజ్జురోతి రాఘవులు, చల్లా రాము, డాక్టర్లు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే నాయకర్‌కు ఘన సత్కారం

నరసాపురం టౌన్ జూలై 7: పట్టణంలోని లూథరన్ చర్చి పాలక మండలి సభ్యులు ఆదివారం ఎమ్మెల్యే నాయకర్‌ను ఘనంగా సత్కరించారు. పాస్టర్లు ఎంఏఎస్ మార్టిన్, ధర్మరాజు, పీసీపీ చైర్మన్ బొంతు ఆనందరాజు, కోశాధికారి జయరాజు, కార్యనిర్వహణ వర్గం శాలువా కప్పి నాయకర్‌ను సన్మానించారు. అనంతరం రుస్తుంబాదా గ్రామంలో పంట కాల్వలో పూడుకుపోయిన గుర్రపుడెక్క, తూడు తొలగింపు పనుల్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. చేపట్టిన పనుల్ని సకాలంలో పూర్తి చేసి శివారు ప్రాంత రైతులకు సాగునీరు పుష్కలంగా అందేలా చూడాలని ఆదేశించారు.



ఉంగుటూరు ఎమ్మెల్యే ధర్మరాజును సత్కరిస్తున్న ఆలయ అధికారి కేవీ గోపాలరావు

మంత్రి నిమ్మలకు కళాకారుల సత్కారం

పాలకొల్లు అర్బన్, జూలై 7 : రాష్ట్ర జలవనరుల శాఖామంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడును ఆదివారం పట్టణ కళాకారులు, నటీనట సమాఖ్య కార్యవర్గ సభ్యులు కలిసి సత్కరించారు. ఈసందర్భంగా కళాకారుల తరపున గుడాల హరిబాబు మాట్లాడుతూ 2015లో ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ఓపెన్‌ఎయిర్ థియేటర్‌ను తొలగించి బీవీరాజు, ఎన్టీఆర్ కళాక్షేత్ర నిర్మాణం చేపట్టిన రామానాయుడు పూర్తి కావచ్చే సమయంలో ఎన్నికలు రావడంతో అసంపూర్తిగా మిగిలి పోయిన కళాక్షేత్రాన్ని ఇటీవల పరిశీలించిన అనంతరం కళాక్షేత్రాన్ని పూర్తి చేసి అందిస్తానని మంత్రి నిమ్మల హామీ ఇవ్వడం అభినందనీయమని అన్నారు. ఈకళాక్షేత్రం పూర్తయితే నాటికల ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు, కళాకారులకు ఎంతగానో ఉపయోగ పడుతుందని తెలిపారు. కార్యక్రమంలో సంస్థ గౌరవాధ్యక్షుడు వంగా నరసింహారావు, వర్కింగ్ ప్రెసిడెంట్ గుడాల హరిబాబు, కార్యదర్శి టి.వెంకటేశ్వరరావు, రాజా తాతాయ్య జి. రామమోహనరావు, ఎస్.రామారావు, పీఎన్ రామలింగేశ్వరరావు, జి. ముత్యాల నాయుడు, వై.వెంకటరత్నం, జీఎస్ఎన్ రవి కుమార్, వీఎన్ రావు, బొక్కా నరసింహమూర్తి, కె.సూర్యప్రకాశరావు, అంబటి రాజు, కౌరు విజయభాస్కరరావు పాల్గొన్నారు.

క్రీడాకారులకు సౌకర్యాలు: బొలిశెట్టి

తాడేపల్లిగూడెం అర్బన్, జూలై 7: క్రీడాకారులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. ఆదివారం పట్టణం వానపల్లి సుధాకర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్ పోటీలకు హాజరైన ఆయన మాట్లాడుతూ ఐదేళ్లుగా ఈ పోటీలను నిర్వహిస్తున్న తుమరాడ చిన్న, సలాం, కరీంలను అభినందించారు. గురుజు నూరిబాబు, పైబోయిన రఘు, రామిశెట్టి సురేష్, పైబోయిన చినవెంకట్రామయ్య, దాగారపు నాగులు పాల్గొన్నారు.

పెద్దింటమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యేలు

కైకలూరు, జూలై 7: కొల్లేటికోట పెద్దింటమ్మవారిని భక్తులు పెద్ద ఎత్తున దర్శించుకుని మొక్కుబడులను చెల్లించుకున్నారు. ఆదివారం కావడంతో వివిధ జిల్లాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు, తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ఈవో కేవీ గోపాలరావు ఎమ్మెల్యేలకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి పూజలు చేయించారు. అనంతరం వారిని అమ్మవారి శేష వస్త్రాలతో సత్కరించారు.

రహదారులు ఛిద్రం

వర్షాలకు పాడైన రోడ్లు.. ప్రయాణికుల అగచాట్లు



తాడేపల్లిగూడెంలో బాడవా పుంత దుస్థితి..



యలమంచిలి బ్రాంచి కాల్వ సమీపంలో పాడైన రోడ్డు

పాలకొల్లు అర్బన్, జూలై 7 : కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షానికి నిత్యం రద్దీగా ఉండే పాలకొల్లు - భీమవరం రోడ్డులో లాకుల వద్ద నుంచి పూలపల్లి సెంటర్ వరకు సుమారు 1.5 కిలో మీటర్ల రోడ్డు పలు ప్రాంతాల్లో గోతుల మయంగా మారింది. పాలకొల్లు - పామర్రు (పిపి)రోడ్డుగా పిలువబడే ఈరోడ్డు వెంబడి నిత్యం వేలాది వాహనాలు తిరుగుతూంటాయి. ఆర్టీసీ బస్సులు, లారీలు, ట్రాక్టర్లు, ఆటోలు, కార్లతో పాటు బైక్‌లు తిరుగుతుంటాయి. ఈరోడ్డు పలు ప్రాంతాల్లో గోతులు పడి పోయింది. యూనియన్ బ్యాంక్ వద్ద, రైలు గేటుకు ఇరువైపులా, చాంబర్స్ డిగ్రీ కళాశాల ఆర్చి వద్ద ఇంకా పలు చోట్ల గోతులు పడి ఉండటంతో చిన్నపాటి వర్షానికే గోతుల్లో నీరు చేరడంతో వాహన దారులు ఇబ్బందులు పడుతున్నారు.

యలమంచిలి: మేడపాడు, యలమంచిలి, చించినాడ, ఏనుగువానిలంక, నవరసపురం గ్రామాల మధ్య రహదారి అధ్వానంగా మారింది. ఈ మార్గంలో పెద్దఎత్తున గోతులు ఏర్పడటం, పలుచోట్ల రహదారి కుంగిపోవడంతో రాకపోకలకు వాహనదారులు అవస్థలు పడుతున్నారు. సుమారు రెండున్నరేళ్ల క్రితం వైసీపీ ప్రభుత్వ హయాంలో రూ.4కోట్లతో రహదారి విస్తరణ, అభివృద్ధి చేసేందుకు పనులు ప్రారంభించినప్పటికీ, కొంతకాలం పాటు రహదారి అభివృద్ధి పనులు నత్తనడకన సాగాయి. చేసిన పనులకు వైసీపీ ప్రభుత్వం బిల్లులు చెల్లించడం లేదని కాంట్రాక్టర్ పనులను నిలిపివేయడంతో ఈ రహదారి మరింత అధ్వానంగా మారింది. ఈ మార్గం లో చాలాచోట్ల కల్వర్టుల వద్ద అసంపూర్తిగా పనులు చేసి వదిలేయడంతో ఆయా ప్రాంతాల్లో గుంతలు పడి, వాటిలో వర్షంనీరు నిలబడిపోయి బురద మయం అవుతోంది. ముఖ్యంగా ఈ మార్గంలో బ్రాంచికాలువ సమీపంలోనూ, ఘటాలచెరువు వద్ద, ఏనుగువానిలంక గ్రామ శివారులోనూ రహదారి ఒక వైపు దిగబడిపోయి పెద్దగోతు లు ఏర్పడి ప్రమాదకరంగా ఉందని వాహనదారులు వాపోతు న్నారు. అంతేకాక రాత్రి సమయంలో ప్రయాణం చేయాలంటే నరకప్రాయమే నని వాహనదారులు పేర్కొంటున్నారు. బ్రాంచికాలువ సమీపంలో చాలాసార్లు వాహనదారులు పడిపోయి క్షతగాత్రులు అయ్యారని.. గడచిన ఐదేళ్లకాలంలో కనీసం మరమ్మతులు చేపట్టిన దాఖలాలు లేవని స్థానికంగా విమర్శలు వెల్లువెత్తాయి.

తాడేపల్లిగూడెం రూరల్: మారంపల్లిలో బాడవా పొలం వెళ్లేందుకు పుంతరోడ్డు లేక రైతులు తీవ్ర ఇబ్బంది పడుతు న్నారు. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు దమ్ము ట్రాక్టర్‌లతో రోడ్డు మొత్తం ఛిద్రం కావడంతో రైతులు నడిచి వెళ్లేందుకు కూడా ఇబ్బంది పడుతున్నారు.

మాచేనమ్మకు భక్తుల తాకిడి

ఆచంట, జూలై 7: జిల్లాలో ప్రశిద్ధి చెందిన పెదమల్లం మాచేనమ్మ అమ్మవారి ఆలయం భక్తులతో పోటెత్తింది. ఆషాడ మాసం మొదటి ఆదివారం కావడంతో భక్తులు ఎక్కువ సంఖ్యలో వచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ప్రాంగణం అంతా భక్తులు, వాహనాలతో కిక్కిరిసిపోయింది. ఈ సందర్భంగా వచ్చిన భక్తులకు ఆలయ అధికారి రాము సిబ్బంది ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.

గంగాలమ్మకు ప్రత్యేక అలంకరణ



నరసాపురం రూరల్, జూలై 7: ఎల్‌బిచర్లలో గంగాలమ్మకు ఆదివారం భక్తులు ప్రత్యేక అలంకరణ చేపట్టారు. చుట్టుపక్కల గ్రామస్థులు, భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి విచ్చేసి చలివిడి, నైవేద్యాలు తీసుకొచ్చి అమ్మవారికి సమర్పించారు. అనంతరం అన్నసమారాధన నిర్వహించారు.

మావుళ్ళమ్మకు ప్రత్యేక పూజలు



ఆలయానికి పోటెత్తిన భక్తులు

పెనుగొండ, జూలై 7: సిద్ధాంతం గ్రామ దేవత మావుళ్ళమ్మ జాతర వేడుకగా నిర్వహిస్తున్నారు. ఆదివారం కావడంతో అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. సాయంత్రం మావుళ్ళమ్మ, రాజ్యలక్ష్మి అమ్మవార్ల దర్శనానికి భక్తులు క్యూ కట్టారు. శుక్ర, శని, ఆదివారాలు తీర్థ మహోత్సవాలు వేడుకగా జరగగా మంగళవారం ఆలయ ప్రాంగణంలో భారీ అన్న సమారాధన ఏర్పాట్లు చేస్తున్నట్లు మావుళ్ళమ్మ ఆలయ ఫ్రెండ్స్ యూనియన్ సభ్యులు తెలిపారు.

మందాలమ్మ ఆలయానికి విరాళం



పెనుగొండ, జూలై 7: వడలి గ్రామదేవత మందాలమ్మ ఆలయ అభివృద్ధికి నాగ సాయి మధు వంశీ ఇంజనీరింగ్ విద్యాభ్యాసం అనంతరం ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా తన మొదటి సంపాదన జీతం 47 వేల 251 రూపాయలను కుటుంబ సభ్యుల సమక్షంలో ఆలయ కమిటీ సభ్యులకు విరాళంగా అందజేశారు. ఇదే కుటుంబానికి చెందిన నాగ సాయి మధు వంశీ చెల్లెల్లు గాయత్రి లక్ష్మి అలేఖ్య, హేమ మణిలక్ష్మి ప్రసన్నలు ఇరువురూ అమ్మవారి ఆలయ నిర్మాణానికి తమ మొదటి జీతాలను చెల్లించిన సందర్భాన్ని పురస్కరించుకుని తల్లిదండ్రులను అభినందించారు.

ఆర్కే ఇన్‌ఫ్రా షోరూం ప్రారంభం



షోరూంను ప్రారంభిస్తున్న మంత్రి నిమ్మల

పాలకొల్లు, జూలై 7: ప్రజలలో ఎప్పటికప్పుడు మారుతున్న అభిరుచులకు అనుగుణంగా గృహ నిర్మాణ సామగ్రి తయారీ విధానం నిర్మాణాలలో ఖర్చు తగ్గించడమే కాకుండా ఇంటికి మరింత అందాన్ని తెస్తుందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. ఆదివారం కొంతేరు రోడ్డులో ఆర్కే ఇన్‌ఫ్రా షోరూంను మంత్రి నిమ్మల ప్రారంభించారు. నగరాలకే పరిమితమైన గృహనిర్మాణాల్లో ఇంటీరియల్ డెకరేషన్‌ను పట్టణాలకు పరిచయం చేస్తున్న షోరూం అధినేత దేవళ్ల రవికిరణ్‌ను మంత్రి అభినందించారు. నూతనంగా నిర్మించే గృహాలలో పెయింట్స్ బదులు పాలీ గ్రానైట్ షీట్స్‌ను అతికించడం ద్వారా జీవిత కాలం మన్నిక ఉంటుందని రవికిరణ్ తెలిపారు. పాలీ గ్రానైట్ షీట్లు వాటర్, ఫైయిర్ గ్రూఫ్ షోరూం లో ఇంటీరియల్ డెకరేషన్‌కు సంబందించిన కొన్ని విభాగాలను మంత్రి పరిశీలించి యాజమాన్యానికి అభినందనలు తెలిపారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు

మొగల్తూరు, జూలై 7: మోళ్ళపర్రు కనకదుర్గ బీచ్‌లో దశావతార సహిత మత్స్యనారాయణస్వామి అష్టలక్ష్మీ సమేత ఆదిలక్ష్మీ అమ్మవార్ల ఆలయంలో ఆదివారం వేకువజాము నుంచి వారాహి అమ్మవారికి పూజలు నిర్వహించారు. అలయ అర్చకులు ప్రవీణ్ కుమార్ ఆచార్యులు ఆధ్వర్యంలో అమ్మవారి సన్నిదిలో నక్షత్ర దోషాలు, కార్యసిద్ధి దుష్టగ్రహ నివారణకు పూజలు జరిపారు. అనంతరం అమ్మవారికి నిర్వహించిన పంచామృతాభిషేకంతో గ్రామస్థులు నాగిడి రంగారావు, సత్తినేని సర్వేశ్వరరావు, మేళం రంగనాద్, నేదునూరి శ్రీనివాస్ దంపతులు పాల్గొన్నారు.

స్వచ్ఛందంగా తూడు తొలగింపు



పెంటపాడు, జూలై 7: బోడపాడు డ్రెయిన్‌లో తూడు, గుర్రపు డెక్క పేరుకుపోయి రైతులకు ఇబ్బందిగా మారింది. ఇప్పుడు వర్షాలు ఎక్కువ కురుస్తుండంతో వర్షపు నీరు ముందుకు సాగక ముదునూరు, ఆకుతీగపాడు, కె.పెంటపాడు, యానాలపల్లి, పరిమెళ్ళ గ్రామాల్లో పొలాలు ముంపునకు గురవుతున్నాయి. దీంతో ఆదివారం ఆయా గ్రామాల రైతులు స్వచ్ఛందంగా తూడు తొలగింపు పనులు చేపట్టారు. తూడు బాగా బిగుసుకుపోయి చేతికి రాక ఎక్స్‌కవేటర్ సహాయంతో తొలగింపు చేపట్టారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ బోడపాడు డ్రెయిన్‌లో తూడు పేరుకుపోయిన విషయాన్ని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ దృష్టికి తీసుకువెళ్లగా టెండర్లు పిలిచామని మరీ ఇబ్బంది అయితే తాను సహకారం అందిస్తానని, స్వచ్ఛందంగా తొలగించుకోవాలని చెప్పడంతో ఎమ్మెల్యే హామీ మేరకు తామే ముందస్తు పెట్టుబడులు పెట్టి ఎక్స్‌కవేటర్‌తో పనులు చేపడుతున్నామన్నారు. గత ప్రభుత్వం వేసవిలో ఉపాధి పనుల్లో తూడు తొలగింపు చేపడితే ఇంత ఇబ్బందిగా మారేది కాదని వాపోయారు. తెలుగు రైతు నాయకులు సర్పంచ్ వీతల సత్యనారాయణ, మాజీ సర్పంచ్ బుద్దన ధనరాజు పాల్గొన్నారు.

బండి ముత్యాలమ్మకు భక్తుల తాకిడి



మొగల్తూరు, జూలై 7: ముత్యాలపల్లి బండి ముత్యాలమ్మ అమ్మవారి ఆలయానికి ఆదివారం భక్తులు భారీగా తరలివచ్చారు. వేకువజాము నుంచి చిరుజల్లులు పడుతున్నా అమ్మవారి దర్శనానికి వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. ఆలయం వద్ద భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఈవో డి.రామకృష్ణంరాజు, ఆలయ సిబ్బంది ఏర్పాట్లు పర్యవేక్షించారు.

56 మంది రక్తదానం



పాలకొల్లు రూరల్, జూలై 7 : ప్రముఖ క్రికెటర్ మహేంద్ర సింగ్ ధోని 43వ జన్మదినం సందర్భంగా స్థానిక లయన్స్, లయో క్లబ్, అమ్మాచారిటబుల్ ఫౌండేషన్, ఎస్‌డీపీ లైఫ్ సేవ్ ఐయర్స్ సేవా సంస్థలు మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. అపద్బంధు బ్లడ్ బ్యాంక్‌లో 56 మంది రక్తదానం చేశారు. ఈసందర్భంగా ఎంఎస్ ధోని క్రికెట్‌రంగానికి చేసిన సేవలను కొనియాడారు.

మంద కృష్ణ మాదిగ పుట్టిన రోజు వేడుకలు



పాలకొల్లు అర్బన్, జూలై 7 : ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణ మాదిగ పుట్టిన రోజును పురస్కరించుకుని స్థానిక గాంధీ బొమ్మల సెంటర్‌లో ఆదివారం పట్టణ అధ్యక్షుడు పసల బోసు అధ్యక్షతన ఘనంగా వేడుకలు జరిగాయి. కేక్ కట్ చేసిశుభా కాంక్షలు తెలిపారు. ముఖ్య అతిథిగా సనమండ ఎబినైజర్ విచ్చేసి మంద కృష్ణ మాదిగ జీవితాశయాలను వివరించారు. మాదిగలు ఐక్యతతో ఉండాలని పిలుపు నిచ్చారు. అనంతరం ఎంఆర్‌పిఎస్ జెండాను ఆవిష్కరించా రు.

ఎంఆర్పీఎస్ ఆవిర్భావ వేడుకలు



ఆచంటలో ఎంఆర్పీఎస్ ఆవిర్భావ వేడుకల్లో పాల్గొన్న స్థానికులు

ఆచంట, జూలై7: ఎంఆర్‌పీఎస్ ఆవిర్భావ దినోత్సవం ఆదివారం పలు చోట్ల నిర్వహించారు. ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ ఆదేశాలు మేరకు ఎంఆర్‌పీఎస్ నాయకులు,కార్యకర్తలు ఎంఆర్‌పీఎస్ జెండాను ఆవిష్కరించారు. యువ నాయకులు సిర్రా బాలాజీ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు.

పెనుగొండ: ఎంఆర్‌పీఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను పెనుగొండ మండలంలో ఆయా గ్రామాల్లో వేడుకగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నిర్వహించారు. స్వీట్లు పంపిణీ చేశారు. పెనుగొండలో జరిగిన కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ నాయకులు గెద్దాడ చిన్న, తానేటి శేఖర్, కడిమి వెంకటేశ్వర్లు, తానేటి మల్లేశ్వరరావు, దిగుమర్తి అక్షింతరావు, తానేటి శ్రీను, రాపాక కృపావరం, ఉందుర్తి సతీష్ కుమార్, ఉండ్రాజవరపు రమేష్, గెద్దాడ చిరంజీవి, కంకిపాటి చిన్నోడు పాల్గొన్నారు.



పెనుమదంలో జెండాలతో ఎమ్మార్పీఎస్ నాయకులు

మొగల్తూరు: ఎస్సీ రిజర్వేషన్‌లో వర్గీకరణ సాధించేవరకూ మాదిగలంతా ఒకేతాటిపై ఉండాలని జిల్లా ఎంఆర్‌పీఎస్ అధ్యక్షుడు కోడెల్లి వెంకట్రావు కోరారు. ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఆదివారం పేరుపాలెం సౌత్‌లో పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంఆర్‌పిఎస్ జాతీయ వ్యవస్థాపకులు ఉసిరిపాటి బ్రహ్మయ్య మాదిగ ఆదేశాల మేరకు ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకోవడం జరిగిందన్నారు

పోడూరు: ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని పెనుమదం లంకవారిపేటలో మండల స్థాయిలో నాయకులు, యూత్, సంఘాల పెద్దలు ఎమ్మార్పీఎస్ జెండాలను ఆవిష్కరించి వేడుకలను ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా మంద కృష్ణమాదిగ జన్మదినం సందర్భంగా కేక్ కట్‌చేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న జిల్లా ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు యార్లగడ్డ రత్నరాజు మాట్లాడుతూ మాదిగలు ఐత్యతతో పనిచేసి ఎమ్మార్పీఎస్ ఆశయాల సాధనకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమానికి సర్పంచ్ తానేటి బాబూరావు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎమ్మార్పీఎస్ సహాయ కార్యదర్శి పసుపులేటి చిన్నబాబు, నియోజకవర్గ అధ్యక్షుడు కాటూరి సువర్ణరాజు, గౌరవాధ్యక్షుడు నూటికుర్తి శ్యాంబాబు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం రూరల్: జగన్నాథపురంలో ఎంఆర్‌పీఎస్ ఆవిర్భావ దినోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. సమితి జగన్నాథపురం నాయకులు గెద్దం సాల్మన్‌రాజు, ఉండ్రాజవరపు రాజు ఎంఆర్‌పీఎస్ జెండా ఆవిష్కరించారు. అనంతరం మంద కృష్ణ మాదిగకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. సమితి నాయకులు సిర్రా ఆశీర్వాదం, కూటమి నాయకులు పరిమి వీరభద్రరావు, చిట్టూరి రంజిత్, పల్లాల అన్నవరం, పల్లంటి సతీష్ తదితరులు పాల్గొన్నారు.